

కడప రాయుడి కోనేటి విహారం
దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం తెప్పోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. - 8లో



హోరాహోరీగా కడప, నెల్లూరు మ్యాచ్
ఏసీఏ అండర్–23 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో నిర్వహించిన కడప, నెల్లూరు మ్యాచ్ హోరాహోరీగా సాగింది. - 8లో



రిమ్స్‌కు మహర్దశ
కడపలోని రిమ్స్ సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. - 8లో

ఉద్యాన సాగు.. ఉపాధి మెరుగు

- వలసలు నివారించేందుకు ఉపాధిలో పండ్ల తోటల పెంపకం
- ఈ ఏడాది లక్ష్యం 1200 ఎకరాలు
- మునగకు ప్రోత్సాహకాలు
- చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం
- రైతుల నుంచి దరఖాస్తులు కోరుతున్న అధికారులు





జిల్లాలో సాగులో ఉన్న బత్తాయి తోట

కడప సిటీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వలసలను నివారిస్తోంది. ఎందరో నిరుపేదలకు స్థానికంగా ఉపాధి కల్పిస్తూ పొట్ట నింపుతోంది. అంతేకాకుండా చిన్న, సన్నకారు రైతులకు ఊతంగా నిలుస్తోంది. ఉపాధి హామీ పథకాన్ని డ్రై ల్యాండ్ హార్టికల్చర్‌కు అనుసంధానం చేయడంతో పండ్ల, పూలతోటలు సాగుచేసే రైతులకు పెట్టుబడి కష్టాలు తీరుతున్నాయి. మొక్కకోసం గుంత తీయడం మొదలుకొని మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తుండడంతో ఉపాధి హామీ పథకం ఉద్యాన రైతులకు వరంగా మారింది. దీంతో జిల్లాలో ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరిగేందుకు అవకాశం ఏర్పడింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చొరవతో డ్రై ల్యాండ్ హార్టికల్చర్‌కు శ్రీకారం చుట్టారు. నీటి వసతి లేకపోయినా సమీపంలోని వంకలు, వాగు లు, కుంటలు ఉంటే చాలని, ఉపాధి నిధులతో పండ్ల తోటలకు అవకాశం కల్పించారు.

సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యత

ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యత కల్పిస్తోంది. ఐదు ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులకు మాత్రమే ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టే అవకాశం ఉంది. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. సంబంధిత మండలాల్లోని ఏపీఓలను కలిసి రైతులు వివరాలు కనుగొని దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

నిబంధన ఇలా..

- పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉండాలి.
- కుటుంబం మొత్తానికి ఐదు ఎకరాలు లేదా అంతకంటే తక్కువ భూమి కలిగి ఉండాలి. తెల్ల రేషన్‌కార్డు సైతం కలిగి ఉండాలి.
- మీసేవ లేదా సచివాలయం నుండి 1బీ నకలు పొందాలి
- సన్న, చిన్నకారు రైతు పత్రం
- సంబంధిత రైతు ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలి. జాబ్ కార్డులోని వారందరి ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు జత చేయాలి.
- ఐదు ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులు అర్హులు.
- ఇంతకుమునుపు ఉపాధి హామీ, ఉద్యానశాఖ, ఏ ఇతర శాఖల నుంచి లబ్ధిపొంది ఉండరాదు.
- పండ్ల తోటలకు పరిసర ప్రాంతాల్లో చెరువు, కాలువ, డకౌట్‌పాండ్ ఉంటే సరిపోతుంది.

ఈ ఏడాది లక్ష్యం ఇలా

ఉపాధి హామీ పథకంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి ప్రణాళిక సిద్ధమవుతోంది. 1200 ఎకరాల్లో ఈ ఏడాది పండ్ల తోటల పెంపకానికి చర్యలు చేపట్టేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు. ప్రస్తుతం రైతులను గుర్తించి లక్ష్యం నెరవేర్చుకునేందుకు అధికారులు మండలాల వారీగా రైతుల దృష్టిని పండ్లతోటల పెంపకం వైపు మళ్లించేందుకు సిబ్బంది సలహాలు, సూచనలు కూడా అందజేస్తున్నారు. దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాక అర్హులైన వారిని గుర్తించి జూన్ మాసం నుంచి పండ్ల తోటల ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు.

పండ్ల తోటల సాగు ఇలా..

జిల్లాలో 2019–20లో 1845 మంది రైతులు 4632 ఎకరాల్లో మామిడి, బత్తాయి, నిమ్మతో పాటు ఇతర పండ్ల తోటలు సాగు చేశారు. అలాగే 2020– 21లో 2591 మంది రైతులు 5940 ఎకరాల్లో, 2021–22లో 2235 మంది రైతులు 5009 ఎకరాల్లో, 2022–23 ఆర్థిక సంవత్సరంలో 664 మంది రైతులు 592 ఎకరాల్లో వివిధ పండ్ల తోటలను సాగు చేశారు. నాలుగేళ్ల కాలంలో జిల్లాలో 7335 మంది రైతులు 17,174 ఎకరాల్లో సాగు చేశారు. 2298 మంది 5150 ఎకరాల్లో మామిడిని, 2752 మంది 6505 ఎకరాల్లో బత్తాయి, 1209 మంది 2738 ఎకరాల్లో నిమ్మ, 1076 మంది 2782 ఎకరాల్లో సపోట, జాస్మిన్,డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ బేర్ పంటలు సాగు చేశారు.

మెట్ట భూముల్లో కూడా పండ్ల తోటలకు అవకాశం



పండ్ల తోటల పెంపకానికి ఆసక్తిగల రైతులు మెట్ట భూములు ఉన్నప్పటికీ సాగు చేయవచ్చు. అయితే సంబంధిత పొలం ఉండే ప్రాంతంలో వంకలు, వాగులు, కాలువలు, డకౌట్‌పాండ్స్ తదితర నీటి వసతి ఉంటే సరిపోతుంది. ఈ ఏడాది 1200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం చుట్టాం. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరుతున్నాం. **– యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప**

ఏయే పండ్ల తోటలకు అవకాశం

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద మామిడి తోటల పైనే రైతులు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. అయితే మామిడితోపాటు జీడి మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్ బేర్, డ్రాగన్‌ఫ్రూట్ తదితర పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చు. అంతేకాకుండా 30–50 సెంట్లలోపు భూమి ఉంటే గులాబీ, బంతి, మల్లెతోటలు అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. ఇటీవల మునగ సాగుకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించింది. అయితే మునగ, మల్లె, గులాబి, డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ బేర్ పండ్ల తోటల నిర్వహణకు బిల్లులు రెండు సంవత్సరాలు మాత్రమే చెల్లిస్తారు. మిగిలిన పండ్ల తోటలకు మూడు సంవత్సరాలు ఇస్తారు.

ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసేందుకు ప్రభుత్వ ప్రోత్సాహక వివరాలు

పండ్ల తోటలు	యూనిట్లు	కాలం	మొక్కలు	అంచనా (రూ.లలో)
మునగ నర్సరీ	5000	3 నెలలు	5000	31,111
మునగ సాగు	ఎకరా	2 సం॥	448	86,614
రోజ్‌గార్డెన్	ఎకరా	2 సం॥	2000	2,00,652
జాస్మిన్ గార్డెన్	ఎకరా	2 సం॥	1600	1,73,122
మ్యాంగో	ఎకరా	3 సం॥	70	1,03,193
బత్తాయి	ఎకరా	3 సం॥	100	1,07,459
నిమ్మ	ఎకరా	3 సం॥	110	1,27,451
తైవాన్ జామ	ఎకరా	3 సం॥	444	2,26,783
సపోట	ఎకరా	3 సం॥	60	90,027
కొబ్బరి	ఎకరా	3 సం॥	60	90,610
సీతాఫలం	ఎకరా	3 సం॥	240	1,82,480
దానిమ్మ	ఎకరా	3 సం॥	267	2,44,819
నేరేడు	ఎకరా	3 సం॥	20	41,912
బేర్ ఆపిల్	ఎకరా	3 సం॥	320	1,08,338
డ్రాగన్ ఫ్రూట్	ఎకరా	3 సం॥	900	1,84,533

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) పర్యవేక్షక ఇంజినీరుగా ఎస్. రమణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ సీఎండీ సంతోష్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి కన్‌స్ట్రక్షన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉన్న ఆయనకు పదోన్నతి కల్పించి కడప సర్కిల్ ఎస్ఈగా నియమించారు. సీఎండీ ఉత్తర్వుల మేరకు బుధవారం సాయంత్రం రమణ విద్యుత్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఒంటిమిట్టలో కర్నూలు కలెక్టర్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని సీతారామలక్ష్మణ మూర్తులను బుధవారం కర్నూలు జిల్లా కలెక్టర్ జి.సృజన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి ప్రదక్షణ కావించి, సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో అర్చకులు వారిని సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు పీర్ కమిటీకి శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్ : పారిశుధ్యంపై గ్రామ పంచాయతీ పురస్కారాల కోసం నిర్వహించే సర్వేలో భాగంగా పీర్ కమిటీ సభ్యులకు గురువారం జెడ్పీలో ఉదయం 10 గంటలకు శిక్షణ ప్రారంభించనున్నట్లు జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వీరన్న ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రతి మండలం నుంచి ఒక గ్రామ పంచాయతీ సర్పంచ్, ఒక పంచాయతీ సెక్రటరీ, ఒక ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, మండల విస్తరణ అధికారి, కంప్యూటర్ ఆపరేటర్ తప్పక హాజరు కావాలని కోరారు.

వందమంది విద్యార్థుల ఎంపిక

కడప ఎడ్యుకేషన్: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింది జిల్లాలోని అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశానికి సంబంధించి మొదటి విడతలో భాగంగా రెండో లాటరీ ద్వారా 100 మంది విద్యార్థులు ఎంపికయ్యారని డీఈఓ రాఘవరెడ్డి బుధవారం తెలిపారు. వీరు ఈ నెల 9వ తేదీలోపు ఆయా ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశం పొందాలన్నారు.

ఫోన్ చేస్తే జాబ్ కార్డు


చక్రాయపేట : ఎవరైనా ఉపాధి హామీ పథకం కింద పనులు చేసుకోవడానికి అర్హులై ఉండి జాబ్ కార్డు లేకుంటే తనకు ఫోన్ చేయాలని జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి తెలిపారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌ల నిర్లక్ష్యం కారణంగా అర్హులైన వారి జాబ్‌కార్డులు డిలీట్ చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. జాబ్‌కార్డు కోసం 799555112 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

రేపు జాబ్ మేళా



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 5వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కడప కలెక్టరేట్‌లోని 'ఒ' బ్లాక్‌లో నిర్వహించే జాబ్‌మేళాలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ప్యానాసోనిక్ కంపెనీ వారు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ మెకానికల్ ఉత్తీర్ణులై 18–30 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి శ్రీసిటీ, నాయుడుపేటలో ఉద్యోగం కల్పిస్తారన్నారు. రూ.13,500 నుంచి రూ.15,500 వరకు వేతనం ఉంటుందని, ఆసక్తిగల పురుష అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని.. ఇతర వివరాలకు 99590 22904, 78929 33270 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

హస్తకళల డైరెక్టర్‌గా నిర్మలాదేవి



నియామక పత్రాన్ని అందుకుంటున్న నిర్మలాదేవి

సంబేపల్లె : ఆంధ్రప్రదేశ్ జానపదాలు, నాట్యకళలు, హస్తకళల డైరెక్టర్‌గా అన్నమయ్యజిల్లా సంబేపల్లె మండలం గుట్టపల్లెకు చెందిన ఎం .నిర్మాలాదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మాలాదేవి మాట్లాడుతూ తనకిచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు.

అన్ని హంగులతో సంక్షేమ హాస్టళ్లు

కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లను అన్ని రకాల వసతులు, హంగులతో తీర్చిదిద్దాలని కలెక్టర్ విజయరామరాజు సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ వార్డెన్లు పిల్లలను సొంత బిడ్డల్లా సంరక్షించాలన్నారు. విద్యార్థుల సౌకర్యాలకు ఎలాంటి కొరత లేకుండా చూడాలన్నారు. జూన్‌లో పాఠశాలలు, కళాశాలల పునః ప్రారంభం నాటికి మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. వంట మనుషులకు వంట నిర్వహణలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు భోజన శాలలను శుచిగా, శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. వేసవి సెలవుల్లోనే హాస్టళ్లలో అడ్మిషన్లు చేపట్టాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పిల్లల పట్ల వార్డెన్లు, బయటి వ్యక్తులు, అక్కడ పనిచేసే వర్కర్లు అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నిర్ణీత సమయానికి హాస్టళ్లకు వస్తున్నారా? లేదా? తెలిపే రోజువారి రిపోర్టును సాయంత్రం ఆయా సంక్షేమశాఖల అధికారులకు పంపాలన్నారు. పిల్లలకు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలన్నారు. బాలికల సంక్షేమ హాస్టళ్లలో వాచ్‌మెన్‌లు కచ్చితంగా ఉండాలని, కంప్లెయింట్ బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాశ్, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ల ఈడీ వెంకటసుబ్బయ్య, మైనార్టీ కార్పొరేషన్, బీసీ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ వి.బ్రహ్మయ్య, డిజైబుల్ మైనార్టీ సంక్షేమ అధికారి కృష్ణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయరామరాజు వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైద్యులు అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పోషకాహార లోపం పిల్లలు, రక్తహీనత మహిళలు కనిపించరాదన్నారు. మండలస్థాయి వరకు వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. విధులకు సరిగా హాజరు కాని వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ జిల్లాలోని అన్ని మండలాల్లో సక్రమంగా అమలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, డీసీహెచ్‌ఎస్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగామ్ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్ర ప్రజల శ్రేయస్సే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన భాకరాపురంలోని సీఎం వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల ప్రకారం ఎక్కడా రాజీ పడకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు.పార్టీలకతీతంగా, పారదర్శకంగా పథకాలను అన్ని వర్గాలకు అందిస్తున్న ఘనత మన రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీలకు మాత్రం ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ఎంతమాత్రం కనిపించవని.. కేవలం బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. కానీ ప్రజలు మాత్రం ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను అభినందిస్తున్నారన్నారు. అనంతరం ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.


పీఆర్సీ వర్తింపజేయాలి

ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పలువురు డీఆర్డీఏ ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం ప్రకటించిన 23శాతం పీఆర్సీ తమకు వర్తించలేదని విన్నవించారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

- వేముల మండలం చింతలజూటూరు గ్రామ ప్రజలు కలిసి తమ గ్రామంలో గంగమ్మ దేవాలయానికి ప్రహరీ నిర్మించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.
- పలువురు నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు కావాలని కోరగా.. పలు కంపెనీలకు లేఖల ద్వారా సిఫార్సు చేశారు.

పాత్రధారి సరే.. సూత్రధారులెవరు ?

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో మోసం కేసులో అటకెక్కిన విచారణ
- అన్ని వేళ్లూ కీలక గుమాస్తా వైపే
- విచారణ జరిపితే వెలుగులోకి నిజాలు
- అక్రమార్కులతో మసకబారుతున్న కలెక్టరేట్ ప్రతిష్ట



కడప కలెక్టరేట్

కడప సెవెన్‌రోడ్స్: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించి కొంతమంది వద్ద రూ. 35 లక్షలు వసూలు చేసి మోసగించిన కలెక్టర్ కార్యాలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శివప్రసాద్ ఉదంతం ఇటీవల కలకలం రేపింది. ప్రొద్దుటూరుకు చెందిన బాధితురాలు గౌసియా ఫిర్యాదుపై కలెక్టర్ విజయరామరాజు వెంటనే స్పందించారు. డబ్బులు వసూలు చేసిన శివప్రసాద్‌ను అప్పటికప్పుడే విధుల నుంచి తొలగించారు. కేసు నమోదు చేయాలని వన్‌టౌన్ పోలీసులను ఆదేశించారు. పోలీసులు క్రైమ్ నంబరు 129/23, సెక్షన్ 406 కింద కేసు నమోదు చేశారు. నిందితుడు స్టేషన్ బెయిలు తీసుకుని బయటికి వచ్చాడు. డబ్బులు రికవరీ చేసి బాధితులకు ఇవ్వాల్సి ఉంది. ఇంతవరకు బాగానే ఉంది. కలెక్టర్ తన మాట వింటాడని లక్షలాది రూపాయలు వసూలు చేసే ధైర్యం ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి ఉంటుందా? కలెక్టరేట్‌లోని కీలక వ్యక్తుల ప్రోద్బలం , భరోసా లేకుంటే తపాలా మోసే ఓ వ్యక్తికి అంతటి బరితెగింపు ఎక్కడి నుంచి వస్తుంది? ఇందులో ఎవరెవరికి వాటాలు అందాయి? ఇలాంటి వ్యవహారాలు ఎంతకాలంగా సాగుతున్నాయి? శివప్రసాద్ కేవలం పాత్రధారేనా? అసలు కథ నడిపిస్తున్న తెర వెనుక సూత్రధారి ఎవరు? లాంటి అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది ఉన్నతాధికారి వెంట తిరుగాడే ఓ కీలక గుమాస్తా పనే అయి ఉంటుందని కలెక్టరేట్‌లో పలువురు గుసగుసలాడుకుంటున్నారు. రెవెన్యూ శాఖలో ఎవరిని కదిలించినా అన్ని వేళ్లూ ఆయనవైపే చూపుతున్నాయి. ఇలాంటి సంఘటన ఏదైనా జరిగిన సందర్భంలో దాని వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారో వెలికి తీసేందుకు శాఖాపరంగా విచారణ నిర్వహిస్తారు. అందుకు ఒక విచారణ అధికారిని నియమించడం సర్వసాధారణం. కానీ ఈ విషయంలో ఇంతవరకు అలాంటిదేమీ జరగలేదు. ఇప్పటికైనా విచారణ నిర్వహించి అసలు దోషులను వెలికి తీసి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో కొంతమేరకైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. రోజూ వివిధ సమావేశాలకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చే జిల్లా అధికారుల పట్ల ఆయన వ్యవహారశైలి అనుచితంగా ఉంటోందన్న విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి.

- కలెక్టరేట్ ప్రతిష్టను మసకబార్చే ఇలాంటి సంఘటనలు గతంలోనూ జరిగాయి. కలెక్టరేట్ సమాచార హక్కు చట్టం విభాగంలో పనిచేసే చంద్రశేఖర్ అనే వ్యక్తి రూ. 5 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- సీకేదిన్నె మండలం పాపాసాహెబ్ పేట వీఆర్వో అబ్బాస్ అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- ఉమ్మడి జిల్లాలోని గాలివీడు మండలంలో తాత్కాలిక వీఆర్ఏగా పనిచేస్తున్న కోలా రమణ పనులు చేయిస్తానంటూ ప్రజల నుంచి రూ. 23 లక్షలు వసూలు చేసిన సంఘటన వెలుగుచూసి పెద్ద కలకలం రేపింది దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆయనను లక్కిరెడ్డిపల్లె కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండుకు తరలించారు. ఆయన నుంచి రూ. 5 లక్షలు రికవరీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. దీని వెనుక ఎవరి ప్రమేయం లేకుండా ఒక తాత్కాలిక వీఆర్ఏ అంత డబ్బు వసూలు చేయగలడ? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు విచారణ జరిపి అసలు దోషులను వెలికి తీయాల్సిన అవసరం ఉంది.
- ఆయకట్టు సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ. 20 వేలు లంచం తీసుకుంటూ కోడూరు మండలం ఓబనపల్లె వీఆర్వో ఏసుదాను ఏసీబీకి పట్టుబడ్డాడు.
- రెవెన్యూ ఉద్యోగులపై ఆరోపణలు అధికంగా వస్తుండడంతో ఏసీబీ అధికారులు ఎర్రగుంట్ల, సిద్దవటం, రైల్వేకోడూరు తదితర మండల తహసీల్దార్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించడం చర్చనీయాంశమైంది.

☛ఇవి రెవెన్యూశాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. నిజాయితీ పరునిగా పేరొందిన జిల్లా కలెక్టర్ విజయరామరాజు జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

7న అల్లూరి శతవర్ధంతి కార్యక్రమాలు

ఆర్డీఓ జి. శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు

జమ్మలమడుగు: ఈ నెల 7వ తేదీన పర్యాటక కేంద్రమైన గండికోటలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన పర్యాటక, విద్యాశాఖాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సౌత్ జోన్ కల్చరల్స్ (తంజావూరు) ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్లూరి జీవిత చరిత్రపై వ్యాసరచన , క్విజ్, రంగోళి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమాలుంటాయన్నారు. గండికోటకు విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ క్రిష్టఫర్, రామమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి ఆత్మహత్య


వాజిద్‌బాషా(ఫైల్)

బ్రహ్మంగారిమఠం : మండలకేంద్రమైన బి.మఠంలోని తెలుగు గంగ కాలనీలో మంగళవారం రాత్రి వాజిద్‌బాషా(17) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ విద్యాసాగర్ కథనం మేరకు వివరాలు.. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్న గౌస్‌భాషాకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు ఇంటర్ లో పాస్‌కాలేదు. అయినా తల్లిదండ్రులు ఏమీ అనలేదు. వాజిద్‌బాషా స్నేహితులతో కలిసి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నాడు.ఏమి అనుకున్నాడో ఏమో మంగళవారం రాత్రి ఇంటి బయట తల్లిదండ్రులు నిద్రిస్తుండగా ఇంటలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున నిద్రలేచి లోపలికి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నట్లు తల్లిదండ్రులు తెలిపారని ఎస్‌ఐ చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేల్‌కు పంపిచినట్లు చెప్పారు.

సెలవులను ఆమోదించని తహసీల్దార్‌పై కేసు

ఒంటిమిట్ట : వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట తహసీల్దార్ శ్రీనివాసరెడ్డిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో మండలంలోని నరవకాటిపల్లి వీఆర్‌వోగా పనిచేసిన తఫ్సూన్ (ప్రస్తుతం వీరపునాయునిపల్లి వీఆర్‌వో) అనివార్య కారణాల వల్ల నెల రోజులు సెలవు పెట్టారు. అయితే వాటిని ఆమోదించమంటూ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో ఆయన తనను మానసిక్షోభకు గురిచేశాడంటూ తఫ్సూన్ తమకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు.

భార్యపై దాడి చేసిన వ్యక్తిపై..

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వక్కలపేటలో సచివాలయం 37/1లో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న ఓనమ్ నాగలక్ష్మిపై గత నెల 24న ఆమె భర్త ఆంజనేయులు దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కర్నూలుకు చెందిన ఆంజనేయులుకు, మైదుకూరుకు చెందిన తనకు 2012లో వివాహమైంది. పిల్లలు లేరనీ తన భర్త రోజూ మద్యం తాగి వచ్చి వేధింపులకు గురి చేసేవాడు, వరకట్న వేధింపుల కోసం దాడి చేసేవాడు. ఈక్రమంలోనే తాను విధుల్లో వుండగా వచ్చి దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం ఆదేశాల మేరకు ఎస్‌ఐ జయరాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

రిమ్స్‌కు మహర్దశ

- పెరిగిన పీజీ వైద్యవిద్య సీట్లు
- తాజాగా 20 విభాగాలకు అందుబాటులో 106 సీట్లు
- ప్రజలకు మెరుగైన వైద్యసేవలు


ప్రభుత్వ సర్వజనవైద్యకళాశాల (రిమ్స్) భవనం

కడప అర్బన్ : జిల్లా ప్రజలకు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వైద్య వరాన్ని అందించారు. అదే ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్). 230 ఎకరాల విస్తీర్ణంలో, రూ. 180 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. 2006–2007 విద్యా సంవత్సరంలో 150 వైద్య విద్య (ఎంబీబీఎస్) సీట్లతో 149 మంది విద్యార్థులతో ప్రారంభమైంది. దినదినాభివృద్ధి చెందుతూ 2013 నుంచి పీజీ స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం 20 విభాగాల్లో మొత్తం 106 పీజీ సీట్లు రిమ్స్‌లో ఉన్నాయి.దీంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

డాక్టర్ వైఎస్‌ఆర్ సంకల్పం గొప్పది..

ముఖ్యమంత్రిగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పదవీలోకి వచ్చినప్పటి నుంచి జిల్లా ప్రజలకు మేలు చేయాలనే దృఢసంకల్పంతో కడప లో ప్రభుత్వం తరపున వైద్యకళాశాలను స్థాపించాలని నిర్ణయించారు. ఏపీఎంఎస్‌ఐడీసీ ద్వారా 2005 ఏడాది చివరిలో రిమ్స్‌కు శంకుస్థాపన చే శారు.తర్వాత ఏడాది కాలంలోనే నిధులను మంజూరు చేసి భవనాలను నిర్మించారు. పరికరాలను ఏర్పాటు చేయించారు. 2006–07 వైద్య విద్యాసంవత్సరం ప్రారంభమైంది. 2007 సెప్టెంబర్ 5న అప్పటి యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ చేతులమీదుగా కడప రిమ్స్‌ను ప్రారంభించారు. అదే సమయంలో కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాలకు శంఖుస్థాపన చేయించారు. పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్యసేవలను అందించాలనే సంకల్పంతో 'సెమీ అటానమస్'విధానాన్ని తీసుకుని వచ్చి వైద్యులను, సిబ్బందిని విరివిగా తీసుకొచ్చారు. రిమ్స్ సర్వతోముఖాభివృద్ధికి విశేష కృషి చేశారు.

ఇవీ విశేషాలు..

- 2011లో ఎంబీబీఎస్ మొదటి బ్యాచ్ విద్యార్థులు వైద్య విద్యను పూర్తి చేసుకున్నారు. ఇప్పటివరకు 12 బ్యాచ్‌ల వారు మొత్తం 1874 మంది వైద్య విద్యను పూర్తి చేసుకున్నారు. మొత్తం 16 బ్యాచ్‌లకుగాను 2472 మంది వైద్య విద్యలో చేరారు.
- 2019–20 నుంచి ఈడబ్ల్యూఎస్(ఎకనామికల్ వీకర్స్ సెక్షన్) కింద మరో 25 వైద్య విద్య సీట్లను పెంచారు. దీంతో 150 నుంచి 175కు చేరుకున్నాయి.
- పీజీ వైద్య విద్య కోసం 2012లో అప్పటి ఎంసీఐ(మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) కు ప్రతిపాదనలను పంపించారు. 10 విభాగాలకుగాను 44 పీజీ వైద్య సీట్లు దశలవారీగా మంజూరయ్యాయి. పీజీ వైద్య విద్యార్థులు 2013–14 బ్యాచ్‌లో చేరగా ఇప్పటివరకు 194 మంది పీజీ వైద్య విద్యను పూర్తి చేశారు.

తండ్రి బాటలోనే తనయుడు..

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి రాగానే జిల్లా ప్రజలకు వైద్య విద్యను అందించేందుకు కృషి చేశారు. వైఎస్సార్ మరణం తర్వాత రిమ్స్ అంతగా అభివృద్ధికి నోచుకోలేదు. ఆయన కుమారుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలో పయనిస్తూ రిమ్స్ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు. రిమ్స్ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ హాస్పిటల్, మానసిక వైద్య కళాశాలల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. భవననిర్మాణ పనులను వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ప్రస్తుతం 10 విభాగాలకుగాను 62 పీజీ వైద్య విద్య సీట్లు మంజూరు కావడానికి రాష్ట్ర ప్రభుత్వం, కడప రిమ్స్ వైద్య కాశాల అధికారుల కృషి ఎంతో ఉంది.

2013 నుంచి ఇప్పటి వరకు వచ్చిన పీజీ సీట్లు

విభాగం పేరు	మంజూరైన సీట్లు
అనాటమీ	02
ఫిజియాలజీ	02
జనరల్ మెడిసిన్	12
జనరల్ సర్జరీ	03
ఆర్థోపెడిక్స్	03
గైనకాలజీ (ఓబిజి)	07
పిడియాట్రిక్స్	03
ఈఎన్‌టీ	03
ఆప్తమాలజీ	03
అనస్తీషియా	06
2023లో మంజూరైన పీజీ వైద్య విద్య సీట్లు	
సైక్రియాట్రీ	05
ఫోరెన్సిక్ మెడిసిన్	05
రేడియేషన్ అంకాలజీ	05
ఎస్‌పీఎం	09
ఫార్మకాలజీ	07
పెథాలజీ	07
మైక్రోబయాలజీ	09
పల్మనరీ మెడిసిన్	05
రేడియాలజీ	05
ఎమర్జెన్సీ మెడిసిన్	05

అందరి సహకారంతోనే అభివృద్ధి



ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ వైద్య విద్య ప్రారంభం నుంచి ఇప్పటివరకు 12 బ్యాచ్‌లు యూజీ పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం, రిమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయా విభాగాధిపతులు, వైద్యులు, వైద్య సిబ్బంది, పరిపాలనా సిబ్బంది సహకారం వల్లే రిమ్స్ అభివృద్ధి సాధ్యమవుతోంది. పీజీ సీట్లు పెరగడం వల్ల ప్రజలకు సంపూర్ణంగా వైద్య సేవలను అందించేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. – డాక్టర్ అవిలేలి సురేఖ, ప్రిన్సిపాల్, కడప రిమ్స్

గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం


పెన్నానది వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : మండలపరిధిలోని పి. సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన పులిఎద్దుల యేసు నారాయణరెడ్డి మంగళవారం పెన్నానదిలో గల్లంతయ్యాడు. మంగళవారం ఎంత గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. బుధవారం విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి అధికారులతో మాట్లాడి గజ ఈతగాళ్లను రప్పించారు. ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. దీంతో అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 8.30 గంటలకు మృతదేహం లభ్యమైంది. అనంతరం ఎమ్మెల్యే మరణించిన యేసు నారాయణరెడ్డి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

అదృశ్యమైన యువకుడి.

ఒంటిమిట్ట : మండల పరిధిలోని నరసన్నగారిపల్లి గ్రామంలో కనిపించకుండా పోయిన శ్రీకాంత్ అనే యువకుడు దొరికాడని బుధవారం స్థానిక పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు సోమవారం నరసన్నగారిపల్లి గ్రామానికి చెందిన పుల్లయ్య కుమారుడు శ్రీ కాంత్ అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.ఒంటిమిట్ట పోలీసులకు గువ్వల చెరువు వద్ద బుధవారం యువకుడు శ్రీకాంత్ దొరికినట్లు తెలిపారు. శ్రీకాంత్, తల్లిదండ్రులను పిలిపించి ఎస్‌ఐ మధుసూదన్ రావు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారని తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌కు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయాలి


మాట్లాడుతన్న రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా వచ్చే నెల నుంచి ప్రారంభంకానున్న ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, సబ్సిడీ విత్తనాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం కడప కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఏ మేరకు ఎరువులు, సబ్సిడీ విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయ అధికారిని అడిగారు. ఇందుకు సంబంధించిన జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు 64000 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రతిపాదనలు పంపామన్నారు. ఇందులో తక్షణ అవసరం మేరకు 12000 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచామన్నారు. అలాగే సబ్సిడీ విత్తనాలకు సంబంధించి పచ్చి రొట్టవిత్తనాలు, పెసర, మినుము, కంది మరియు వేరుశనగ విత్తనాలు 11784 కింటాళ్ల పంపిణీకి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఖరీఫ్‌లో ముందస్తు వర్షాల వల్ల చిరు ధాన్య పంటలైన రాగి, సజ్జ, జొన్న పంటలను సాగు చేయాలని, అలాగే ఆపరాల పంటలకు సంబంధించి మినుము, పెసర పంటలను సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు, ఉద్యానశాఖ ఏడీ సుబాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


బండలాగుతున్న ఎడ్లు

చాపాడు : మండలంలోని గుంతచీపాడు గ్రామంలోని కృష్ణాలయం వద్ద బుధవారం సంప్రోక్షణ చల ప్రతిష్ట వేడుక జరిగింది. ఇందులో భాగంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వైఎస్సార్ జిల్లా జంగంపల్లెకు చెందిన పుత్తా నాగసుబ్బారెడ్డి ఎడ్లు 2,526 అడుగులతో ప్రథమ స్థానంలో నిలవగా, ప్రొద్దుటూరు మండలం కల్లూరు పెరుమాల్ శివకృష్ణయాదవ్ ఎడ్లు 2,519 అడుగులతో ద్వితీయ, నంద్యాల జిల్లా శనగపల్లె చక్రవర్తి గౌడ్, క్రాంతినగర్ అనుషారాణి ఎడ్లు 2501 అడుగులతో తృతీయ స్థానంలో, ప్రొద్దుటూరు మండల ఖాదర్‌బాద్‌కు చెందిన నాగసుబ్బారెడ్డి ఎడ్లు 2,332 అడుగులతో నాలుగో స్థానంలో, కడప మండల రంగోరుపల్లె రామసుబ్బారెడ్డి ఎడ్లు 2018 అడుగులతో ఐదో స్థానంలో, గోపవరం మండలం నెమలయ్యకు చెందిన ఎడ్లు 1813 అడుగులతో ఆరో స్థానంలో, పోతురెడ్డిపల్లెకు చెందిన వరలక్ష్మీ ఎడ్లు, అల్లగుత్తికి చెందిన సంగటి బాబు ఎడ్లు సమానంగా 1750 అడుగులతో ఏడో స్థానంలో, చియ్యపాడు, పెద్దపుత్తకు చెందిన సాయి గణేష్, వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు 1640 అడుగులతో 8వ స్థానంలో, కల్లూరుకు చెందిన నాగేష్ ఎడ్లు 1027 అడుగులతో 9వ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.5వేలు చొప్పున ఉత్సవ నిర్వాహకులు అందజేశారు.

వివాహ వేడుకలో డిప్యూటీ సీఎం, మేయర్




కడప కార్పొరేషన్ : కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎస్‌ఎస్ ప్రవీణ్‌చంద్ వివాహ రిసెప్షన్‌కు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులు హాజరయ్యారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్ నందు జరిగిన ఈ వివాహంలో వారు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, కార్పొరేటర్లు చెన్నయ్య, సుబ్బారెడ్డి, షంషీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కె. రాజశేఖర్‌రెడ్డి, బాలక్రిష్టారెడ్డి, అక్బర్, గౌస్, కిరణ్, బసవరాజు, సుభాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బత్యాల వాహనం ఢీకొని యువకుడికి గాయాలు


గాయపడిన హర్షవర్ధన్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొటిక వారిపల్లి వద్ద చెంగలరాయుడు వాహనం ద్విచక్ర వావానాన్ని ఢీకొంది.దీంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి.. స్థానికుల కథనం మేరకు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్యాల చెంగలరాయుడు మండల పరిధిలోని పత్రపల్లిలో జరుగుతున్న ఓ క్రీడా కార్యక్రమానికి కారులో బయలుదేరాడు. చింతరాజుపల్లి వైపు నుంచి స్కూటీలో ఇద్దరు యువకులు వస్తున్నారు. కొటిక వారిపల్లి వద్ద చెంగలరాయుడు వాహనం బైక్‌ను ఢీ కొంది. దీంతో ద్విచక్రవాహనంలో వస్తున్న హర్షవర్ధన్ అనే యువకుడికి కాలు విరిగింది. అతన్ని వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో యువకుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యువతి అదృశ్యం

సంబేపల్లె : యువతి అదృశ్యంపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. ఎస్‌ఐ వివరాలమేరకు గురిగింజకుంట పంచాయతీ ఎర్రకాలువపల్లెకు చెందిన యువతి బుధవారం తెల్లవారు జాము నుంచి కనిపించలేదని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరిమళించిన మానవత్వం


అనాథ వృద్ధుడికి స్నానం చేయిస్తున్న రామకృష్ణారెడ్డి దంపతులు

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులోని ఆర్టీసీ బస్టాండులో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ అనాథ వృద్ధుడిని వివేకానంద ఆశ్రమం చేరదీసింది. వివరాలు.. అనాథ అయిన ఇతను గాలికి తిరుగుతూ..దొరికింది తింటూ నెల్లూరు నగరం చేరాడు అరవై ఏళ్ల క్రితం. అప్పటికి తనకు పదహారేళ్లు. అక్కడ హోటల్ నడుపుతున్న తమిళ తంబి రమ్మని పిలిచాడు. అన్నం పెట్టాడు. ఆశ్రయం ఇచ్చాడు. అమ్మానాన్న, గురువు అన్నీ తానే అయ్యాడు. హోటల్ యజమాని తొలిసారి తనను కుమార్ అని పిలిచాడు. అదే పేరుగా మారిపోయింది. కమార్‌కు హోటల్ యజమానే వివాహం చేశాడు. కాలక్రమంలో హోటల్ యజమాని చెన్నైకి వెళ్లడంతో హోటల్ మూతపడింది. కుమార్ భార్య కూడా కాన్సర్‌తో మృతిచెందింది. దీంతో అనాథ అయిన కుమార్ నెల్లూరు నగరాన్ని వదిలి పాదచారిగా ప్రయాణం ప్రారంభించాడు. ఓపిక ఉన్నంత కాలం తిరిగాడు. అలసిపోయి మూడు రోజుల కిందట కలసపాడుకు చేరుకున్నాడు. ఆర్టీసీ బస్టాండులో ఉన్న అనాథ పరిస్థితిని గమనించిన స్థానిక వలంటీర్ శ్రావణ్‌కుమార్ వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్నిరామకృష్ణారెడ్డికి సమాచారం ఇచ్చారు. బుధవారం ఆయన, ఆయన సతీమణి రామతులసితో వచ్చి అనాథకు స్నానం చేయించారు. ఫలహారం అందించారు. అనంతరం వివేకానంద సేవాశ్రమానికి తీసుకెళ్లి ఆశ్రయం కల్పించారు. మానవత్వంతో కూడిన వీరి సేవలను స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

హోరాహోరీగా కడప, నెల్లూరు మ్యాచ్


చెన్నారెడ్డి, కడప (4 వికెట్లు)


వంశీకృష్ణ, కడప (53 పరుగులు)


శ్రీనివాసులరెడ్డి కడప, 73 పరుగులు

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్-23 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో బుధవారం నిర్వహించిన కడప, నెల్లూరు మ్యాచ్ హోరాహోరీగా సాగింది. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 46.1 ఓవర్లలో 208 పరుగుల వద్ద ఆలౌటైంది. జట్టులోని శ్రీనివాసులరెడ్డి 73 పరుగులు, వంశీకృష్ణ 53 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ సాకేత్‌రామ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 48 ఓవర్లలో 207 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రోషన్‌పవన్‌కుమార్ 76 పరుగులు, మాధవ్ 64 పరుగులు చేశారు. కడప బౌలర్ చెన్నారెడ్డి 4 వికెట్లు తీశాడు. దీంతో కడప జట్టు ఒక్కపరుగు ఆధిక్యంతో విజయం సాధించింది.

కడప రాయుడి కోనేటి విహారం


తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


తెప్పోత్సవంలో ఆండాళ్ తాయారుతో కడప రాయుడు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం తెప్పోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు సాయంత్రం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం చేసి పల్లకీలో కొలువుదీర్చారు. అర్చకులు మయూరం తివిక్రమ్ బృందం వేదమంత్రోచ్చాటనలతో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి పుష్కరిణిలో సిద్ధం చేసి ఉన్న తెప్పలో కొలువుదీర్చారు. పూజల అనంతరం మంగళహారతులు ఇచ్చి మొదట వేదమంత్రోచ్చాటనలతో తెప్పను పుష్కరిణిలో తొలి ప్రదక్షిణ చేయించారు. రెండోమారు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు గాయకులు భక్తిగీతాలాపనతో తెప్పతో ప్రదక్షిణ నిర్వహించారు. మూడోమారు స్వామి, అమ్మవారు మంగళ వాయిద్యాల మధ్య ప్రదక్షణ చేశారు. మంగళ హారతులు అనంతరం స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ఆధునికంగా రూపుదిద్దిన కోనేటిలో తొలిసారి తెప్పోత్సవం నిర్వహించారు. చుట్టూ రంగురంగుల విద్యుద్దీపాలను అలంకరించారు. స్వామి పుష్కరిణిలో విహరిస్తుండగా భక్తులు గోవింద నామ స్మరణలతో తన్మయులయ్యారు. గురువారం రెండవరోజు తుతెప్పోత్సవం నిర్వహించనున్నారు.